క్లుప్తంగా

డయల్ యువర్ కమిషనర్ నేడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 0861 – 2355678 ఫోన్ నంబర్‌ను సంప్రదించి తమ సమస్యలను తెలియజేయాలని కోరారు. అలాగే స్పందన కార్యక్రమంలో అర్జీలను సమర్పించాలని సూచించారు.

వినాయక చవితి ఉత్సవాల్లో అన్నదానం



నెల్లూరు(బృందావనం): వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మైపాడు గేట్ సెంటర్లో ఆదివారం అన్నదానం జరిగింది. నవాబుపేటలోని శ్రీమద్ ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజ స్వామి దేవస్థానం పునఃనిర్మాణ కమిటీ అధ్యక్షుడు మద్దూరు సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు నగిరి చంద్రశేఖర్, మదన్, సుబ్బారెడ్డి, బ్రహ్మయ్య, సునీల్, మైపాడుగేట్ మిత్రమండలి సభ్యులు పర్యవేక్షించారు.

ఉచిత వైద్య శిబిరం



నెల్లూరు(బారకాసు): స్థానిక డైకసరోడ్డు సెంటర్‌లోని వియాని హోమ్‌లో శ్రీవత్స చెస్ట్ అండ్ చిల్డ్రన్స్ క్లినిక్, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దీనిని ప్రారంభించిన డాక్టర్ చిరంజీవి ఈసందర్భంగా మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రథమ చికిత్స చేస్తున్న పీహెచ్‌పీల సేవలు అభినందనీయమన్నారు. ఆ అసోసియేషన్ పిలుపు మేరకు పిల్లలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు కల్యాణి, విశ్రాంత ఏఎస్‌ఐ షేక్ మహబూబ్‌బాషా, పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, పీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి వేణుగోపాల్, నెల్లూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శేషయ్య, శ్రీనివాసులు, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, వియాని హోమ్ నిర్వాహకురాలు రమా సిస్టర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆరోగ్య సురక్ష సర్వే



పొదలకూరు : జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే మండలంలో ముమ్మరంగా జరుగుతోంది. పొదలకూరు, తోడేరు, ఆర్‌వైపాళెం గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఆదివారం ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాల్లో దీర్ఘకాలిక వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకుంటున్నట్లు వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు తెలిపారు. ముందుగా 10 సంవత్సరాలు నిండిన బాలుడి నుంచి పెద్దల వరకు బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలను విధిగా నిర్వహిస్తామన్నారు. సచివాలయాల్లో వైద్యనిపుణుల ద్వారా శిబిరాలు నిర్వహించడానికి 20 రోజుల ముందు నుంచి ఇంటింటి సర్వే నిర్వహించాల్సిందిగా ఉత్తర్వులు వచ్చినట్లు పేర్కొన్నారు. సర్వే పూర్తి చేసిన కుటుంబాల్లో వ్యాధులు ఉన్నవారికి ఆరోగ్య సిబ్బంది టోకెన్లను అందజేస్తున్నారు. వీటి ప్రకారం వారు ఆయా సచివాలయాల్లో నిర్వహించే వైద్య శిబిరానికి వలంటీర్లతో కలిసి హాజరుకావాల్సి ఉంటుంది.

నిమజ్జనంలో అపశ్రుతి

నెల్లూరు(క్రైమ్): వినాయక విగ్రహాల నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరు చెరువు గణేశ్ నిమజ్జన ఘాట్ వద్ద శనివారం వినాయక విగ్రహం నిమజ్జనం చేస్తుండగా క్రేన్ రోప్ తెగిపోవడంతో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారని సమాచారం.

ఆటో పరికరాల చోరీ

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): తను తన ఇంటి బయట నిలిపి ఉన్న ఆటోలో పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీ చేశారని మర్రిపాడు మాజీ సర్పంచ్ కన్నెమరకల వెంగయ్య తెలిపారు. దశాబ్ద కాలంగా తాను క్రీస్తు బోధనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక సేవలో ఉన్నానని, క్రీస్తు సేవకులను ప్రార్థనా మందిరాలకు తరలించేందుకు దాతలు తనకు ఆటో సమకూర్చగా క్రీస్తు సేవకులు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు.

15 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

• భక్తిశ్రద్ధలతో గుంజ ప్రతిష్ట

నెల్లూరు(బృందావనం): నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వచ్చే నెల 15 నుంచి 23వ తేదీ వరకు 49వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం గుంజ ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారి జె.శ్రీనివాసరావు, రాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గుంజ ప్రతిష్ట అనంతరం అమ్మవారికి రంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు.

భక్తుల కోసం ఏర్పాట్లు

ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరిపేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఎంపీ ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చారని వివరించారు. త్వరలో ఆదాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారని వెల్లడించారు. దేవస్థానం అభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందిస్తున్న రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆలయాభివృద్ధిలో భాగంగా 29 సెంట్ల స్థలం చెందేలా సహాయ సహకారాలందించిన పూర్వ కలెక్టర్ చక్రధర్‌బాబు,



గుంజను ప్రతిష్ఠించి పూజ చేస్తున్న దృశ్యం



గుంజ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న వారు

ప్రస్తుత కలెక్టర్ హరినారాయణన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధికి సంబంధించి ప్రక్రియను త్వరలో పూర్తి చేయడం జరుగుతుందని రంగారెడ్డి వెల్లడించారు. నగర మేయర్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. జయరామ్ మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి సహకరిస్తున్న ఎంపీ ఆదాల, వేమిరెడ్డి దంపతులకు



ఆహ్వానపత్రికలను ఆవిష్కరించిన మేయర్, విజయ డెయిరీ చైర్మన్ తదితరులు

ధన్యవాదాలు తెలిపారు.

➡ అక్టోబర్ 2న రాజరాజేశ్వరి అమ్మవారి మాల ధారణ కార్యక్రమం 17వ సంవత్సరం చేపట్టనున్నట్లు పెంచలరెడ్డి తెలిపారు. సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ వాకర్స్ సభ్యులకు సత్కారం

నెల్లూరు రూరల్: జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిండు నూరేళ్లు వర్ధిల్లు కార్యక్రమంలో భాగంగా ఈ నెలలో జన్మించిన సభ్యులను ఆదివారం నెల్లూరు పొదలకూరు రోడ్డు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సత్కరించారు. సన్మానం అందుకున్న వారిలో వాసుదేవయ్య, కోటేశ్వరరావు, నారాయణరెడ్డి, కోటేశ్వరమ్మ, సుజనమ్మ, హరిసుధా, నారాయణమ్మ ఉన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రమణమూర్తి, డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి,



ప్రసాద్, ఖాజా మస్తాన్, చెంచయ్య, రాజగోపాల్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి

నెల్లూరు(పొగతోట): బధిరులకు ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని నగర మేయర్ పి.స్రవంతి అన్నారు. ఆదివారం ప్రపంచ బధిరుల దినోత్సవం సందర్భంగా ఎన్‌జీఓ భవనంలో కార్యక్రమాన్ని హియరింగ్, హ్యాండీక్యాప్డ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేయర్ విచ్చేసి మాట్లాడారు. బధిరుల అసోసియేషన్‌కు భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించాలన్నారు. సదరం ధ్రువీకరణపత్రాలు పారదర్శకంగా ఇవ్వాలన్నారు. ప్రతి సంవత్సరం బధిరులకు ఆటల పోటీలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటస్వామి, బధిరుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్



మేయర్‌ను సన్మానిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మస్తానయ్య, కార్యదర్శి టి.గంగాధర్, మాధవరెడ్డి, శివప్రసాద్, మల్లేశ్వరరావు, సంధ్యారాణి, సాహితి పాల్గొన్నారు.

కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెం మహాత్మా గాంధీనగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో ఆదివారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామికి సంప్రదాయంగా 16 రోజుల పండగను నిర్వహించారు. ఈనెల 7వ తేదీన శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం 16 రోజుల పండగను విశేషంగా నిర్వహించారు. శ్రీకృష్ణస్వామి తరఫున పెళ్లిపెద్దలుగా కనియంపాటి మాల్యాద్రి, మహాలక్ష్మమ్మ, అమ్మవార్ల తరఫున ఆర్.రామసుబ్బు, వాసుకి, ఆర్.కనకరాజు, శరణ్య వ్యవహరించారు. సాయంత్రం కల్యాణమూర్తులను నయనానందకరంగా అలంకరించి వేదికపై పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ జరి



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గింది. రాత్రి ఏకాంతసేవ వేడుకగా చేపట్టారు. మందిరం ప్రధానార్చకులు బి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కార్యక్రమాలు జరిగాయి. మందిర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.సుబ్బరామరాజు, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం సీనియర్ సాఫ్ట్‌బాల్ పురుష, మహిళ జట్ల ఎంపికలు జరిగినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మలిరెడ్డి కోటారెడ్డి, సీహెచ్ కామేశ్వరి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు పదో సీనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలియజేశారు.

పేద బ్రాహ్మణుల సంక్షేమానికి సహకారం

నెల్లూరు(బృందావనం): సమాజంలో నిరుపేదలైన బ్రాహ్మణుల సంక్షేమం కోసం బ్రాహ్మణ సమైఖ్యతా వేదిక కృషి చేస్తుందని ఆ వేదిక నిర్వాహకుడు దూబగుంట రామచంద్రరావు తెలిపారు. ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని శ్రీకురువాడ లలితమ్మ కల్యాణ మండపంలో బ్రాహ్మణ సమైఖ్యతా వేదిక సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ తమ సోదరుడు దూబగుంట వెంకటేశ్వరరావు 2018లో యునైటెడ్ బ్రాహ్మిణ్ ఫోరం స్థాపించి వివిధ సేవ కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఆయన ఆశయ సాధన మేరకు ఫోరంలోని సభ్యులు తమ సొంత నిధులను వెచ్చించి పేద బ్రాహ్మణులకు అండగా



మాట్లాడుతున్న ఫోరం నిర్వాహకులు

నిలవాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో పవని నాగేంద్ర ప్రసాద్, శ్రీశైలం శ్రీధర్, ఎస్‌వీఎల్ వరప్రసాద్, ఎం.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో కోలాహలం

ఇందుకూరుపేట: వినాయక చవితి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన నిమజ్జనోత్సవానికి మైపాడు తీరం వేదికైంది. మండల పరిధిలోని వినాయక విగ్రహాలనే కాకుండా నెల్లూరు నగరంతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి సైతం భారీ సంఖ్యలో గణపయ్య విగ్రహాలను ఆదివారం మైపాడు తీరానికి తీసుకొచ్చారు. యువకులు రంగులు చల్లుకుంటూ బాణసంచా కాలుస్తూ.. డీజేల మధ్య కేరింతలు కొడుతూ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. తీరానికి తీసుకొచ్చిన విగ్రహాలకు చివరిసారిగా పూజా కార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనం చేశారు. అనంతరం యువకులు సముద్ర స్నానాలు ఆచరించి ఉత్సాహంగా గడిపారు. దీంతో తీరంలో కోలాహలం నెలకొంది.

నేత్రపర్వంగా నగర సంకీర్తన

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నగర సంకీర్తన కార్యక్రమం కనులపండువగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు సంప్రదాయరీతిలో కాషాయ వస్త్రధారణలో గోవింద నామస్మరణ చేస్తూ కొండచుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం క్షేత్రవాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సమావేశంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు అనంతలక్ష్మి, నెల్లూరు దత్తాత్రేయమఠానికి చెందిన మాతా అనంతానంద గిరి స్వామిని, అఖిల భారత సహ ధర్మజాగరణ్ ప్రముఖ్ శ్యాం కుమార్ తదితరులు ప్రసంగించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ద్విచక్ర వాహన మెకానిక్‌ల కార్యవర్గం ఏర్పాటు

ఆత్మకూరు: నియోజకవర్గ పరిధిలో ద్విచక్ర వాహనాల మెకానిక్‌ల అసోసియేషన్ ఏర్పాటు అభినందనీయమని ఎంవీఐ ఎం.రాములు అన్నారు. పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం నియోజకవర్గంలోని అన్ని మండలాల ద్విచక్ర వాహన మెకానిక్‌ల అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. ఎంవీఐ రాములు మాట్లాడుతూ మెకానిక్ అసోసియేషన్‌కు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఏదైనా ప్రమాదం సంభవించిన క్రమంలో ప్రభుత్వ పరంగా వారికి రావాల్సిన ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తొలుత మెకానిక్‌లు అందరూ ద్విచక్ర వాహనాల్లో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా మతీన్, జమీర్, మునీర్, అన్వర్‌బాషా, హసీన్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంవీఐ రాములు, డాక్టర్ జె.ప్రణీత్ కుమార్ సభ్యులకు ఐడీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా టూవీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కాంతయ్య, కార్యదర్శి షేక్ అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం నేడు

జలదంకి: భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో జలదంకి బస్టాండ్ సెంటర్లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం రాష్ట్ర సోషల్ మీడియా కో–కన్వీనర్ వడ్డే శ్రీనాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. రక్తదాతలు మరొకరికి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని తెలియజేశారు.

సింహపురి నుంచి షిర్డీకి సాయి భక్తుల యాత్ర

నెల్లూరు(బృందావనం): సుమారు 500 మందికి పైగా సాయి మాలధారణతో ఆదివారం షిర్డీకి బయలుదేరారు. బాలాజీనగర్ శివారు పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఇరుముడులు ధరించి నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌కు షిర్డీ సాయినాథుడి చిత్రపటంతో పాదయాత్ర చేపట్టారు. బాలాజీనగర్, ఆత్మకూరు బస్టాండ్‌ల మీదుగా ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆ మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మాట్లాడుతూ 41 రోజులుగా సాయి మాలధారణతో మండలదీక్ష చేపట్టిన సుమారు 300 మంది ఇరుముడులధారణతో, అలాగే నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మరో 200 మంది షిర్డీ యాత్రకు బయలుదేరారన్నారు. 23 సంవత్సరాలుగా సింహపురి నుంచి షిర్డీకి క్రమం తప్పకుండా



యాత్రకు బయలుదేరిన సాయిభక్తులు

యాత్ర చేపడుతున్నామన్నారు. అక్కడ వారంరోజులు వివిధ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమం శ్రీసాయిభక్త బృందం పర్యవేక్షణలో సాగుతుందన్నారు.

ముస్లింల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా షబ్బీర్

నెల్లూరు(బృందావనం): ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా షబ్బీర్ నియమితులయ్యారు. కేవీఆర్ పెట్రోలు బంక్ దగ్గర బ్రహ్మానందపురంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యవర్గాన్ని రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ రఫీ అహ్మద్ ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా షేక్ షానవాజ్, ఎస్‌డీ జమీర్, చీఫ్ సెక్రటరీలుగా ఎస్‌డీ జహీర్, ఎస్‌కే రఫీ, అధికార ప్రతినిధిగా షేక్ జియావుద్దీన్, కోశాధికారిగా షేక్ అబ్దుల్ సలాం, నెల్లూరు నగర అధ్యక్షుడిగా సయ్యద్ ముసమిల్ హుస్సేన్, లీగల్ అడ్వైజర్‌గా షేక్ ఇలియాజ్ అహ్మద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధి, సంక్షేమమే



మాట్లాడుతున్న రఫీ అహ్మద్

తమ సంఘం ధ్యేయమని తెలిపారు. జిల్లాలో పేద ముస్లింల ఉన్నతి కోసం తమ సంఘం ఆవిర్భవించిందన్నారు. నిరుపేద బాలలు బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలన్నదే తమ లక్ష్యమన్నారు.

‘వాకర్స్’ అధ్యక్షుడిగా నరసింహ యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వేదాయపాళెంలోని గాంధీ నగర్ రోడ్డు పార్క్‌లో మహాత్మా గాంధీ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంఎల్ నరసింహయాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్డీ మీరా మొహిద్దీన్, కోశాధికారిగా వి.విజయకుమార్, గౌరవాధ్యక్షుడిగా మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా అధ్యక్షుడు నరసింహయాదవ్‌ను సత్కరించారు. నగరపాలక సంస్థ, దాతల సహకారంతో పార్కును అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ వ్యవస్థాప



నరసింహ యాదవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కులు మస్తాన్‌గౌడ్, ఎం.రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.



రెండో స్థానం సాధించిన విశాఖపట్నం జట్టు

ముగిసిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

మూడు రోజులుగా నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఏలూరు ఎంపీ, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు అందజేశారు.

– నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)



మూడో స్థానంలో నిలిచిన శ్రీసత్యసాయి జిల్లా జట్టు

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

మనుబోలు: దివ్యాంగుడికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ట్రై సైకిల్‌ను అందజేశారు. మండలంలోని గోవిందరాజపురం గ్రామానికి చెందిన తాళ్లూరు పోలయ్య దివ్యాంగుడు. నడవలేని ఈయన గత ప్రభుత్వ హయాం నుంచి ట్రై సైకిల్ కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి గుంజి రమేష్ మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి పోలయ్యకు ట్రై సైకిల్ మంజూరు చేయించారు. కాగా వాహనాన్ని ఎంపీడీఓ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ ఆదివారం పోలయ్యకు అందజేశారు. దీంతో పోలయ్య హర్షం వ్యక్తం చేస్తూ



పోలయ్యకు ట్రై సైకిల్ అందజేస్తున్న ఎంపీడీఓ తదితరులు

మంత్రి కాకాణికి రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో గుంజి రమేష్, ఆవుల తులసీరాం పాల్గొన్నారు.

వయోజనులకు ‘అక్షర చైతన్యం’ పరీక్ష



పొదలకూరు కేంద్రంలో పరీక్ష రాస్తున్న వయోజనులు



మనుబోలు : పరీక్ష రాస్తున్న వయోజనులు

పొదలకూరు : మండలంలోని వయోజనులకు అక్షర చైతన్యం – 2 పరీక్షను ఆదివారం నిర్వహించారు. మొత్తం 49 కేంద్రాలను ఏర్పాటు చేసి పరీక్షను జరిపినట్లు ఎంపీడీఓ నగేష్‌కుమారి తెలిపారు. మొత్తం 1,371 మంది ఉండగా 1,308 మంది పరీక్షకు హాజరైనట్లు తెలియజేశారు.

21 కేంద్రాల్లో..

మనుబోలు : అక్షర చైతన్యం – 2 కార్యక్రమంలో భాగంగా మండలంలోని 21 కేంద్రాల్లో వయోజనులకు ఆదివారం పరీక్షలు నిర్వహించామని ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. ఆయన మడమనూరులోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 630 మంది వయోజనులు అక్షర చైతన్యం కార్యక్రమంలో భాగంగా రాయడం, చదవడం నేర్చుకుంటున్నారని తెలిపారు. వీరిలో 610 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలియజేశారు. పరీక్షలను సీఆర్‌ఎంటీలు చెంచురామయ్య, శ్రీనివాసులు, స్వరూప పర్యవేక్షించారు. ఇన్విజిలేటర్లుగా సచివాలయ పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్‌లను నియమించారు.